క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయాలి

కోవూరు : సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ ఎం.పద్మజ అన్నారు. కోవూరు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1ను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బందిపై జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందని, ఏ చిన్న పొరపాటు జరిగినా పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజల సమస్యను పరిష్కరిస్తూ పుస్తక నిర్వహణ చేయాలన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం పెంపు

కొడవలూరు : వేసవి శిక్షణ శిబిరంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో మంగళవారం ఆయన వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం, కథలు వినడం ద్వారా విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కథలు చెప్పించడం, చిత్రలేఖనం వేయడం చేయించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి, రిసోర్స్ పర్సన్ వెలగపూడి రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలు పాలిచర్ల శ్రీనివాసులురెడ్డి, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

• కొడవలూరులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో మంగళవారం బొమ్మలు గీయించడం, కథలు చెప్పించడం చేశారు. కార్యక్రమానికి రిటైర్డ్ టీచర్ వెంకయ్య రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎస్సార్ నిధులతో స్వయం ఉపాధి

ముత్తుకూరు : అదానీ కృష్ణపట్నం పోర్టుకు సంబంధించి సీఎస్సార్ నిధుల సహకారంతో మహిళలు స్వయం ఉపాధి ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవడం సంతోషంగా ఉందని ఫౌండేషన్ సదరన్ రీజియన్ ప్రతినిధి డాక్టర్ అనీల్ బాలకృష్ణన్ అన్నారు. సీఎస్సార్ ద్వారా సామగ్రి పొంది స్వయం ఉపాధితో రాణిస్తున్న ఎనిమిది మంది మహిళలను మంగళవారం వారు కలుసుకుని, మాట్లాడారు. గుమ్మళ్లదిబ్బ, ఈపూరు వెంకనపాళెం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో దుకాణాల వద్ద మహిళలతో ముచ్చటించారు. స్వయం ఉపాధి ద్వారా వచ్చిన మార్పులను అడిగి తెలుసుకున్నారు. వారి సంపాదన, పొదుపు తదితర అంశాలను చర్చించారు. సీఎస్సార్ హెడ్ రాజేష్‌రంజన్, ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్‌బాబు, అనూష జర్సాల తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు పంచాయతీ పరిధిలో ఇండస్ట్రీయల్ ఏరియా సమీపంలో కోడి పందేల స్థావరాలపై పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఇక్కడి అటవీ ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారంతో సీఐ గంగాధర్‌రావు తన సిబ్బందితో వెళ్లి దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద మూడు కోళ్లు, రూ.2,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు : మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఎంపీడీఓ నగేష్‌కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 15వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించుకోవాలని, 16న పరిశీలన జరుగుతుందన్నారు. 17, 18 తేదీల్లో ఎంపికైన వారి వివరాలను వెల్లడిస్తామన్నారు. మండల పరిధిలో ఖాళీలకు సంబంధించి సూరాయపాళెం-1(ఓసీ మహిళ), ఇనుకుర్తి-1(ఓసీ మహిళ), తాటిపర్తి బిట్-1 జనరల్-1, తాటిపర్తి బిట్-2 బీసీ జనరల్-1, బత్తులపల్లి-1(ఎస్సీ మహిళ), పొదలకూరు బిట్-1 బీసీ మహిళ-1, జనరల్-2, పొదలకూరు బిట్-4 బీసీ మహిళ-1 కలిపి మొత్తం తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్‌గా అంకబాబు



పొదలకూరు : వికలాంగ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్‌గా పొదలకూరు మండలం నల్లపాళేనికి చెందిన టి.అంకబాబును నియమిస్తూ మంగళవారం సమితీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.చిన్నసుబ్బయ్యయాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా, నగర, నియోజకవర్గ, మండలాల కమిటీలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా వీహెచ్‌పీఎస్ కన్వీనర్ అంకబాబు ఆధ్వర్యంలో అన్ని కమిటీలను నూతనంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



కరపత్రాలను అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 29వ డివిజన్లోని సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సంక్షేమ పథకాలపై కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తామని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు సత్తార్, ప్రసాద్, అవినాష్, సుధాకర్, శ్రీనివాస్ యాదవ్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు మల్లికార్జున్‌యాదవ్, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, సాయిరెడ్డి, సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 39వ డివిజన్లో గల తిరిసిపేట, బాద్‌షాపేట, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో ఏయే సమస్యలను పరిష్కరించాలో ఇప్పటికే గుర్తించామని చెప్పారు. డివిజన్లో రూ.1.2 కోట్లకు సంబంధించిన పనులకు టెండర్లు పిలిచామన్నారు. తిరిసిపేటలో రెండు రోడ్లు, ఒక డ్రెయిన్ పెండింగ్‌లో ఉందని, వీటికి సైతం త్వరలో టెండర్లు పిలిచి పనులను ప్రారంభించనున్నామని చెప్పారు. చిన్న సమస్యలకు సంబంధించిన పనులను రూ.20 లక్షల సచివాలయ నిధులతో పూర్తి చేస్తామని వివరించారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సునీల్, ప్రసాద్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు

నెల్లూరు (దర్గామిట్ట): జర్నలిస్టులకు నూతనంగా మంజూరు చేయనున్న అక్రిడిటేషన్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరి నారాయణన్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా అక్రిడిటేషన్లను మంజూరు చేయాలని కోరారు. పలు సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సామ్నా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, రామ్మూర్తి, హనోక్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

నెల్లూరు(వేదాయపాళెం): మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన ప్రదర్శనను సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అంకయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్, సురేష్, షానవాజ్, ఏఐటీయూసీ నేతలు ఆంజనేయులు, రమణయ్య, చెన్నయ్య, అజీజ్ అహ్మద్ నాగేంద్ర, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

ఆక్రమణల తొలగింపు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్లో గల జనార్దన్‌రెడ్డికాలనీలో ప్రధాన కాలువపై నిర్మించిన పలు అక్రమ కట్టడాలను సంబంధిత అధికారులు మంగళవారం తొలగించారు. అక్రమ కట్టడాలను ఉపేక్షించబోమని వారు స్పష్టం చేశారు.

యూజర్ చార్జీలను బాధ్యతగా చెల్లించాలి



నెల్లూరు(బారకాసు): చెత్త సేకరణకు సంబంధించిన యూజర్ చార్జీలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెల్లించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. కోటమిట్ట శానిటేషన్ మస్టర్ పాయింట్‌ను మంగళవారం తనిఖీ చేశారు. జెండావీధి, పెద్దబజార్, ఖుద్దూస్‌నగర్, పరమేశ్వరినగర్, మూలాపేట, తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ సిబ్బంది హాజరును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని కోరారు.

పూర్తి స్థాయిలో విచారణ జరపాలి

మాగుంట లేఅవుట్లోని డీమార్ట్ ప్రాంతంలో సెల్‌ఫోన్ టవర్ నిర్మాణ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరపాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానికులు చేపట్టిన నిరసన శిబిరాన్ని సందర్శించారు. జనావాసాల మధ్య సెల్‌ఫోన్ టవర్ నిర్మాణంతో వివిధ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ఈ క్రమంలో పనులను ఆపాలని స్థానికులు కోరారు. అనంతరం బారాషహీద్ దర్గా ఆవరణలో పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. కార్పొరేటర్లు గౌరి, వాసంతి, కో ఆప్షన్ సభ్యురాలు మొబీనా, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కిసాన్‌నగర్, రైతుబజార్ సబ్‌స్టేషన్ల పరిధిలో గల పెన్నార్, బోడిగాడితోట ఫీడర్లలో విద్యుత్ లైన్లను మారుస్తున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, వైకుంఠపురం, సత్యనారాయణపురం, జాకీర్‌హుస్సేన్ నగర్, శ్రీనివాసనగర్, మైపాడు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• డీఎస్సార్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ జెడ్పీ కాలనీ ఫీడర్‌లో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో నేతాజీనగర్ 2, 3, 4, 5, 6వ వీధుల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని ఐఈఈ సెక్షన్ ఏఈఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత



నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడారు. ట్రస్ట్ శత జయంతి వేడుకలను పురస్కరించుకొని వీటిని అందజేశామని చెప్పారు.

నేదురుమల్లికి నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వర్ధంతిని నగరంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. పేదలకు దుప్పట్ల పంపిణీతో పాటు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

పార్టీ గడ్డు పరిస్థితుల్లో ఉంది

కాంగ్రెస్ పార్టీ జిల్లాలో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని, ఈ తరుణంలో పార్టీని గతంలో వీడిన వారు తిరిగి రావాలని డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, శేషారెడ్డి కోరారు. వెంకట్రావ్, ఫయాజ్, శ్రీనివాసులురెడ్డి, అల్లావుద్దీన్, నసీమా, రూబెన్, మోహన్‌రెడ్డి, మల్లికార్జున, పవన్‌కుమార్, విజయమ్మ, ఏసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

• పొగతోటలోని కేఎస్సార్ కాంప్లెక్స్‌లో గల ప్రజా సంఘాల కార్యాలయంలో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామ్, బీసీ నేతలు రమణయ్య, కృష్ణయ్య, సాయిరామ్, మురళి, గోపాల్, కనకరాజు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు



నెల్లూరు(బారకాసు): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన ఆరుగురు విద్యార్థులకు నగదు పురస్కారాలను మంగళవారం అందజేశారు. రంగనాయకులపేటలోని పీఎమ్మార్ మున్సిపల్ హైస్కూల్లో జాలీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సూర్యనారాయణ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను సత్కరించారు. జాలీ ఫ్రెండ్స్ సభ్యులు శరణ్‌కుమార్, సుబ్బయ్య, సునీల్‌కుమార్, వెంకటేశ్వర్లు, బాబ్జీ, ఫిజికల్ డైరెక్టర్లు కుమార్, శశిధర్, సుధీర్‌గుప్తా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తీర్థవాది



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడు కోనేర్ల వద్ద తీర్థవాదిని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజావరోహణను రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా సుజాత, వెంకటరత్నం కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీ



నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు పట్టణ ఆరోగ్య కేంద్రాలను వైద్య, ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్‌కు చెందిన డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్, వరల్డ్ బ్యాంక్ కన్సల్టెంట్ గణేష్ మంగళవారం తనిఖీ చేశారు. ఎన్టీఆర్ నగర్, వెంగమాంబ వీధి, జనార్దన్‌రెడ్డి కాలనీ, పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. వైద్య సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాల లక్ష్యం, తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు.

నేత్రదానం





శ్రీనివాసులు, నవనీతమ్మ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): భక్తవత్సలనగర్‌కు చెందిన శ్రీనివాసులు (60), రంగనాయకులపేటకు చెందిన నవనీతమ్మ (92) వారి వారి నివాసాల్లో మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో వీరి నేత్రాలను ప్రభుత్వ పెద్దాస్పత్రికి చెందిన నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. మోటివేటర్లు సుధీర్, ప్రసాద్ సమాచారంతో నేత్రాలను సేకరించారు.

ఈబస్ టెక్నాలజీతో కేన్సర్‌కు చికిత్స



నెల్లూరు(అర్బన్): ఈబస్ అనే నూతన టెక్నాలజీతో 57 ఏళ్ల వృద్ధుడికి లంగ్ కేన్సర్‌ను అప్పటికప్పుడే నిర్ధారించి ఉచితంగా చికిత్స చేశామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో మంగళవారం ఆయన తెలియజేశారు. కేన్సర్ లక్షణాల నిర్ధారణ పరీక్షలు చేస్తే రిపోర్ట్ రావడానికి 10 నుంచి 12 రోజుల సమయం పట్టేదని చెప్పారు. తమ ఆస్పత్రిలో ఈబస్ అనే నూతన పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. దీని ద్వారా కొద్ది సమయంలోనే కేన్సర్ నిర్ధారణ పరీక్షలను చేయగలుగుతున్నామని తెలిపారు. అనంతరం సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ మాట్లాడారు. అన్ని రకాల వైద్యసేవలను ఇక్కడే అందిస్తున్నామన్నారు. ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర రెడ్డి, పల్మనాలజిస్ట్ సుస్మితారెడ్డి, అనస్తీషియా డాక్టర్ రంగనాథం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కాలనీలో అగ్నిప్రమాదం



ముత్తుకూరు : వివిధ పామాయిల్ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులకు సంబంధించిన కాలనీలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నారికేళపల్లి పంచాయతీలోని బావితోపు వద్ద రేకుల షెడ్లు ఉన్న కాలనీల్లో కొందరు వంట చేసేందుకు చిన్న గ్యాస్ సిలిండర్‌ను వెలిగించారు. అయితే, పైపు లీకై ఒక్కసారిగా మంటలు పైకి లేచాయి. కొద్దిసేపు గందరగోళం నెలకొంది. తేరుకున్న కార్మికులు ఇసుక, నీళ్లతో మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దుస్తులు, బూట్లు, పెట్టెల్లో దాచుకొన్న ఆధార్ కార్డులు, తదితర పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.